సాక్షి వికారాబాద్

శుక్రవారం । 31 । మార్చి । 2023



పెరిగిన కూలి.. మెరుగైన ఉపాధి

ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు రోజువారీ కూలి పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 8లో▸



నిర్మాణమయ్యేదెన్నడో?

జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అనే చందంగా మారాయి. 8లో▸

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

మర్పల్లి: కాంగ్రెస్ పార్టీ రావులపల్లి ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, వార్డు సభ్యుడు హజ్రత్ అలీ, సీనియర్ నాయకులు కిషోర్‌గౌడ్, సురేష్, శ్రీను, జహంగీర్ తదితరులు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.





కల్యాణ శోభలో భక్తులకు దర్శనమిచ్చిన సీతారాములు

అంతా రామమయం

రామనామ స్మరణతో ఆలయాలు మార్మోగాయి. జిల్లా వ్యాప్తంగా సీతారాముల కల్యాణ వేడుకలను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి వివాహ వేడుకలను తిలకించేందుకు భక్తజనం పోటెత్తారు. ఊరూవాడా పెళ్లి బాజాలతో దద్దరిల్లాయి. ఆలయ కమిటీలు, దాతల సౌజన్యంతో వివాహ భోజనాలు ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తుల సమక్షంలో ఆదర్శ దంపతులు ఒక్కటయ్యారు. – అనంతగిరి



వికారాబాద్‌లోని రామమందిరంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కుల్కచర్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, ఉద్యోగులు

కుల్కచర్ల: గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో సీఆర్టీ (కాంటాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు)గా విధులు నిర్వర్తిస్తున్న వారికి.. వేసవి సెలవుల్లో కూడా వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం చేసిన ప్రకటనపై సంబంధిత ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు గురువారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలకు అండగా నిలుస్తోందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషిచేస్తోందని తెలిపారు. సీఆర్టీల క్రమబద్ధీకరణ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఉద్యోగులు కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాందాస్ నాయక్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, సీఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మంజుల, నాయకులు అరవింద్, రాజు, చందర్, అనసూజ, గోపాల్, శ్రావణి, మంగమ్మ, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంను కలుస్తా

పీఆర్టీయూ టీఎస్ నేత గుర్రం చెన్నకేశవరెడ్డి



చెన్నకేశవరెడ్డి

యాచారం: ఉపాధ్యాయుల సమస్యలపై త్వర లో సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిస్తానని పీఆర్టీయూ టీఎస్ నేత గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. తన స్వగ్రామం మొండిగౌరెల్లిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన గెలుపు కోసం పీఆర్టీయూ టీఎస్ శ్రేణులు ఎంతగానో కష్టపడ్డారని తెలిపారు. ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో సమీక్షించినట్లు చెప్పారు. పీఆర్టీయూ టీఎస్ నుంచి రెండుసార్లు గెలిచిన జనార్దన్‌రెడ్డి రెబల్‌గా మళ్లీ పోటీ చేసి ఓట్లు చీల్చడం, డబ్బు ప్రభావితం చేశాయన్నారు. అయినా ఆందోళన చెందడం లేదని, ఉపాధ్యాయుల సమస్యలే ప్రధాన ఎజెండాగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వివరించారు.

ఆస్తిపన్ను చెల్లింపునకు నేడే చివరి రోజు

సాక్షి, సిటీబ్యూరో: శుక్రవారంతో ముగియనున్న ఈ ఆర్థిక సంవత్సరం(2022–23) ఆస్తిపన్ను చెల్లించాల్సిన వారి సదుపాయార్థం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు అన్ని సర్కిళ్లలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లు(సీఎస్‌సీ) రాత్రి 11 గంటల వరకు పనిచేయనున్నాయి. ఆన్‌లైన్ ద్వారా అర్ధరాత్రి 12గంటల లోపు చెల్లించవచ్చని జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లు గణనీయంగానే జరుగుతున్నప్పటికీ, పెరిగిన దుబారా ఖర్చులు.. ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారుల ఆడంబరాలు, వివిధ ప్రాజెక్టుల పనులు తదితరమైన వాటితో ఎన్ని కోట్ల రూపాయలు వసూలవుతున్నా ఖజానా పరిస్థితి లోటుగానే ఉంటోంది. గతంలో రూ.వెయ్యికోట్లు వసూలు కావడమే గగనమనుకున్న పరిస్థితి నుంచి ఏటికేడు టార్గెట్‌ను పెంచుతున్నారు. 2022–23 ఆర్థిక సంవత్సర టార్గెట్ రూ.2వేల కోట్లు కాగా, ఫిబ్రవరి నెలాఖరు వరకు రూ.1,514 కోట్లు వసూలయ్యాయి. మార్చినెల ఒకటోతేదీ నుంచి 30వ తేదీ సాయంత్రం వరకు దాదాపు రూ.88 కోట్లు వసూలయ్యాయి. వెరసీ రూ.1,602 కోట్లు వసూలయ్యాయి.

అన్నదాతకు సద్దిమూట

- నేటినుంచి పరిగి మార్కెట్లో రూ.5కే భోజనం
- మూడేళ్ల ఎదురు చూపులకు తెర
- పథకాన్ని ప్రారంభించనున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి
- రైతులు, హమాలీలకు కడుపునిండా తిండి



వికారాబాద్: వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతుల ఆకలి తీర్చేందుకు ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక పథకం సద్దిమూటకు మోక్షం కలిగింది. పరిగి వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం నుంచి పథకం ప్రారంభం కానుంది. స్థానిక ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి చేతులమీదుగా సద్దిమూటకు శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలో ఏడు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా మొట్టమొదటగా మూడేళ్ల క్రితమే పరిగి మార్కెట్‌కు పథకం మంజూరైంది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ప్రారంభానికి ముహూర్తం కుదరలేదు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మున్సిపల్ చైర్మన్ అశోక్ చొరవ తీసుకుని ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో రైతన్నలు, మార్కెట్‌లో పనిచేసే హమాలీలకు రూ.5కే భోజనం లభించనుంది. పరిగి తర్వాత జిల్లాలోని అన్ని మార్కెట్లకు దీన్ని విస్తరించాలని అధికారులు భావిస్తున్నారు. సద్దిమూట భోజనంలో అన్నంతో పాటు పప్పు, కూరగాయలతో వండిన కర్రీ, పప్పుచారు, మజ్జిగ, పాపడాలు అందజేస్తారు.

2014లో ప్రారంభం

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్లో 2014లో మొదటిసారి ఈ పథకం ప్రారంభమైంది. నిత్యం వ్యవసాయ మార్కెట్లకు వచ్చే రైతులు, అందులో పని చేసే హమాలీలకు ఐదు రూపాయలకే భోజనం అందిస్తున్నారు. రైతులు, హమాలీలు రూ.5 చెల్లిస్తే.. మిగితా ఖర్చును సంబంధిత మున్సిపాలిటీలు, పంచాయతీలు భరించాలి. పథకం ప్రారంభానికి ముందు కేవలం నిర్వహణ కోసం మాత్రమే ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

ఖర్చు కష్టమే..



పరిగిలో సద్దిమూటను ప్రారంభించి రైతులు, హమాలీలకు భోజన సదుపాయం కల్పించటం హర్షణీయం. పాత్రల కొనుగోలు కోసం మాత్రమే ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఆతర్వాత మున్సిపాలిటీలే ఖర్చు పెట్టడం కష్టమైన పని. పథకం ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించాలి.

– వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నేత

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సద్దిమూట పథకం జిల్లాలో ముందుగా పరిగి వ్యవసాయ మార్కెట్‌లో ప్రారంభించడం సంతోషంగా ఉంది. ఈ పథకం మంజూరు కోసం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. రైతులు, హమాలీలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎ.సురేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్, పరిగి

పదవి ఎవరిని వరించేనో?

- బషీరాబాద్ మార్కెట్ కమిటీ కుర్చీ కోసం పోటాపోటీ
- ఎస్టీ మహిళకు చైర్‌పర్సన్ పీఠం
- ఎమ్మెల్యే పరిశీలనలో ముగ్గురు నేతల సతీమణుల పేర్లు

బషీరాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి కోసం బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మార్చి 6న పాత కమిటీ పదవీకాలం ముగిసినప్పటికీ కొత్త చైర్‌పర్సన్‌ను నియమించలేదు. ఈ సీటు ఎస్టీ మహిళకు రిజర్వు కావడం, పదవీ కాలాన్ని రెండేళ్లకు పెంచడంతో మండలానికి చెందిన ముగ్గురు నేతలు తమ సతీమణులను పీఠంపై కూర్చోబెట్టేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డైరెక్టర్ల సంఖ్యను సైతం 14నుంచి 18కి పెంచారు. దీంతో నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. ముఖ్యంగా చైర్‌పర్సన్ సీటును తన భార్య శాంతాబాయికి ఇవ్వాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాము నాయక్ కోరుతున్నారు. అలాగే మంతన్‌గౌడ్ తండాకు చెందిన సీనియర్ నాయకుడు ధన్‌సింగ్ తన భార్య కవితకు అవకాశం ఇవ్వాలని, భోజ్యానాయక్‌తండాకు చెందిన మరో నాయకుడు మన్యానాయక్ తన సతీమణికి చాన్స్ ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే నారాయణరావు తన అనుచరుడైన ధన్‌సింగ్ భార్యకు పదవి ఇవ్వాలని ఇప్పటికే ఎమ్మెల్యేకు సూచించినట్లు తెలిసింది. రాము నాయక్‌కు పార్టీ మండల అధ్యక్ష పదవి ఉన్నందున అతడి భార్యకు చైర్మన్ పదవీ బదులు డైరెక్టర్ ఇవ్వవచ్చని తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు ఆశీస్సులు ఉన్నవారికే చైర్‌పర్సన్ పదవి దక్కుతుందని ప్రచారం జరగడంతో మన్యానాయక్ నేరుగా మాజీ ఎమ్మెల్యే వద్ద కూర్చుని తన భార్య పేరు ప్రతిపాదించాలని కోరినట్లు పార్టీవర్గాల ద్వారా తెలిసింది. అయితే బషీరాబాద్ మండలం ఎమ్మెల్యే సొంత మండలం కావడంతో ఎమ్మెల్యే తండ్రి విఠల్‌రెడ్డి పార్టీ వ్యవహారాలు చూస్తుంటారు. ఈక్రమంలో డైరెక్టర్ల విషయంలో ఆయన చెప్పిన వారికి కూడా ప్రాధాన్యత దక్కే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ వర్గ వారికి కూడా డైరెక్టర్ పదవుల ఎర వేస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ప్రజాదరణ పొందిన ముఖ్యమైన నాయకులకు డైరెక్టర్ పదవులు ఇవ్వడానికి ఆశ చూపుతున్నట్లు పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. పదవుల పంపిణీ వ్యవహారం వారం రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.



బషీరాబాద్ మండల నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

33 జీపీలు.. 11 మంది ఎఫ్‌ఏలు!



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- ముందుకు సాగని ఉపాధి పనులు
- ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్‌కు రెండుమూడు గ్రామాల బాధ్యతలు
- కొత్త పంచాయతీల్లో మేట్లతోనే పనుల నిర్వహణ
- పారదర్శకత లోపిస్తున్న వైనం
- పట్టించుకోని ఉన్నతాధికారులు

ఉపాధి హామీ వివరాలు

గ్రామ పంచాయతీలు	33
జాబ్‌కార్డులు	28,649
నమోదైన కూలీలు	15,955
పనిచేసే కుటుంబాలు	1800
కూలీలకు కల్పించిన పనిదినాలు	1,77,534
వంద రోజులు పని పూర్తయిన కుటుంబాలు	26

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వహణకు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కరువయ్యారు. ఒక్కో ఎఫ్‌ఏ రెండు మూడు గ్రామాల బాధ్యతలు చూసుకోవాల్సి వస్తోంది. దీంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. కొత్త జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ప్రస్తుతం పాత పంచాయతీల్లోని వారే పనులను పర్యవేక్షిస్తున్నారు.

గాడి తప్పుతున్న పర్యవేక్షణ

మండలంలో 20 కొత్త పంచాయతీలు, కొత్తగా ఏర్పడినవి 13 కలిపి మొత్తం 33 జీపీలు ఉండగా.. ప్రస్తుతం 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే పని చేస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆయా గ్రామాల్లోని కూలీలకు పదిశాతం కన్నా తక్కువ పనిదినాలను కల్పించారనే కారణంతో నలుగురిని తొలగించారు. దీనికి తోడు కొత్తగా ఏర్పడిన 13 జీపీలకు ఎఫ్‌ఏలను నియమించలేదు. వాస్తవానికి ఒక్కో గ్రామానికి ఒక్కో ఫీల్డ్ అసిస్టెంట్ చొప్పున విధులు నిర్వర్తించాలి. కానీ నాలుగేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం వీరి నియామకాలు చేపట్టడం లేదు. ప్రస్తుతం కొత్త పంచాయతీల బాధ్యతలను సైతం పాత జీపీల్లో విధులు నిర్వహిస్తున్న వారికే అప్పగించారు. రెండు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను చేయించాల్సి రావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్లపై పనిభారం పెరుగుతోంది. పనుల పర్యవేక్షణ గాడి తప్పుతోంది. ప్రస్తుతం ఎఫ్‌ఏలు లేని 22 జీపీల్లో సీనియర్ మేట్లకు పనుల బాధ్యతలు అప్పగించారు. వీరు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో పనుల్లో పారదర్శకత లోపిస్తోంది. ఉపాధి కల్పించడంలో విఫలం కావడంతో కూలీల సంఖ్య పెరగడంలేదు. కేంద్రం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో మేట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీల మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వేతనాల చెల్లింపుల్లో జాప్యం ఏర్పడుతోంది. ఇప్పటికైనా అన్ని జీపీల్లో ఎఫ్‌ఏలను నియమించి, పనులు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

పనులు చేయిస్తున్నాం..



కొత్త జీపీల్లో ఎఫ్‌ఏల నియామకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో ఆయా పంచాయతీల్లో సీనియర్ మేట్ల ద్వారా పనుల నిర్వహణ, పర్యవేక్షణ కొనసాగుతోంది. ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ఎఫ్‌ఏను నియమించాలని ఆదేశిస్తే నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్

వ్యక్తిగత దూషణలు సహించం

- పార్టీ సీనియర్లను అవమానించడం సరికాదు
- ఎమ్మెల్యే ఆనంద్, ఆయన తొత్తుల తీరు మారాలి
- లేదంటే వచ్చే ఎన్నికల్లో నష్టం తప్పదు
- గ్రూపు తగాదాలను ప్రోత్సహిస్తే బీఆర్ఎస్‌ను బలహీనపర్చినట్లే
- మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్



మర్పల్లిలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మర్పల్లి: ఎమ్మెల్యే ఆనంద్‌కు తొత్తులుగా మారిన కొంతమంది వ్యక్తులు తమను వ్యక్తిగతంగా దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని, ఇది ఎంతమాత్రం సరైంది కాదని మర్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసీ, ఎంపీటీసీల ఫోరం మండల చైర్మన్ రవీందర్, మర్పల్లి మాజీ వైస్ ఎంపీపీ అంజయ్యగౌడ్, పంచలింగాల సర్పంచ్ సురేందర్‌రెడ్డి, దామస్తాపూర్ మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము చేసిన పోరాటాలు ఎమ్మెల్యే అనుచరులకు తెలియనివి కావన్నారు. తన విజయం కోసం కృషి చేసిన సీనియర్లను ఎమ్మెల్యే పక్కన పెట్టారని, వారిని అవమానాలకు గురిచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీఆర్ఎస్ జెండాలు మోసిన వారికి, సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న వారికి కనీస గౌరవం దక్కడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే ఆనంద్ మండలానికి వచ్చినప్పుడు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అందరికీ నాయకుడిలా ఉండాల్సిన ఎమ్మెల్యే కొందరికే ప్రాధాన్యం ఇస్తే నష్టం ఎవరికో ఆయనే గుర్తించాలన్నారు. దళితుల అభ్యున్నతి కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కొంత మంది సర్పంచ్‌లు ఇతర పార్టీలకు చెందిన దళితుల నుంచి కమీషన్లు తీసుకుని రెండో విడత కోసం పేర్లు నమోదు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి వ్యవహారాలతో బీఆర్ఎస్‌కు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఉద్యమకారులను విస్మరించిన ఎమ్మెల్యే గ్రూపులను ప్రోత్సహించేలా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. ఇక ముందు ఎమ్మెల్యే అనుచరులు తమపై కానీ తమ మద్దతుదారులపై కానీ సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆనంద్ ఇప్పటికైనా అందరినీ కలుపుకొని వెళ్లాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదని హితవు పలికారు. గత ఎన్నికల్లో తాను ఎమ్మెల్యే ఆనంద్ గెలుపుకోసం పనిచేయలేదని తెలిసి కూడా తనను పార్టీలోకి తీసుకుని, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవిని కట్టబెట్టారన్నారు. ఈవిషయాలన్నీ మర్చిపోయి తమను అవమానాలకు గురిచేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆదేశిస్తే తాను వెంటనే పదవిని వదిలేస్తానని, కేవలం పార్టీ కార్యకర్తగా మాత్రమే పనిచేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనంత్‌రెడ్డి, పంచలింగాల మాజీ సర్పంచ్ సురేష్, యాదవరెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రవి, ఘణాపూర్ శంకర్, పట్లూర్ చౌకత్, రాములు, రథన్ తదితరులు ఉన్నారు.

అదాని.. మోదీ బినామీ

- దేశాన్ని దోచి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్న ప్రధాని
- ప్రశ్నించేవారిని కేసులతో వేధింపులు
- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- శంకర్‌పల్లిలో పలు అభివృద్ధి పనులుప్రారంభం



టంగటూరు–మోకిల మధ్య వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

శంకర్‌పల్లి: ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడు ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. దేశాన్ని దోచిపెట్టి అదానికి కట్టబెడుతున్నారని, అదాని మోదీ బినామీ అని దుయ్యబట్టారు. గురువారం శంకర్‌పల్లి మండలం టంగటూరు–మోకిల గ్రామాల మధ్య మూసీవాగుపై రూ.12.90 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన వంతెన నిర్మాణం పనులను ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే.. టంగటూరులో అదనపు తరగతి గదులను, రూ.90లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒకప్పుడు అదాని ఆస్తులు రూ.50వేల కోట్లుంటే.. ప్రస్తుతం 12లక్షల కోట్లకు ఎలా ఎదిగాడని ప్రశ్నించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడే నాయకులను వ్యవస్థలను అడ్డుపెట్టుకొని వేధిస్తున్నారని విమర్శించారు. ఇటీవల మొయినాబాద్ మండలంలో నలుగురు ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ చేసిన ప్రయత్నం బెడిసికొట్టిందని, తమ బండారం బయటపడినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్సీ కవితపై అనేక కేసులు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తలాతోక లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శం నిలుస్తోందన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


గుర్రాల వెంకటప్ప మృతదేహం

కొడంగల్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం ఉదయం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన గుర్రాల వెంకటప్ప(50) బుధవారం గుండ్లకుంట గ్రామంలో ఓ పెళ్లికి వెళ్లాడు. పనులు ముగిశాక రాత్రి కావడంతో అక్కడే నిద్రపోయాడు. గురువారం వెంకటప్పను నిద్ర లేపేందుకు ప్రయత్నించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి కుమారుడు గుర్రాల ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవిగౌడ్ తెలిపారు.

బైక్‌లు ఢీ.. బాలుడి మృతి

ఇద్దరికి తీవ్రగాయాలు


శశాంక్ మృతదేహం

పరిగి: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బాలుడు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన రుక్కుంపల్లి గేటు సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రుక్కుంపల్లికి చెందిన ఆంజనేయులు తన కుమారుడు శశాంక్(11)తో కలిసి పరిగి నుంచి గ్రామానికి వెళ్తుండగా.. కలెక్టరేట్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న నరేంద్ర బైక్‌పై ఎదురుగా వస్తున్న క్రమంలో ఢీకొన్నాయి. శశాంక్ అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడు తండ్రి ఆంజనేయులుకు, నరేంద్రకు తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శశాంక్ పరిగి పట్టణ కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

కుల్కచర్ల: బైక్ అదుపుతప్పి కిందపడటంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. దోమ మండలం మల్లెపల్లికి చెందిన కృష్ణ (27) కుల్కచర్ల మండలం రాంనగర్ వచ్చి తిరిగివెళ్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కొందరు 108కి సమాచారం అందించడం సిబ్బంది బాధితుడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాగారంలో శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన


శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనలో నాయకులు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో గురువారం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జె. హన్మంత్‌రెడ్డి ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. శివాజీ చూపిన మార్గంలో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కూలి.. మెరుగైన ఉపాధి

ఎన్ఆర్ ఈజీఎస్ కూలీల్లో హర్షాతిరేకాలు
- ఇదివరకు కూలి రూ.257
- ప్రస్తుతం రూ.15 పెంపు
- జాబ్‌కార్డులందరికీ పని కల్పించేందుకు అధికారుల చర్యలు

అనంతగిరి: ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు రోజువారి కూలి పెరిగింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ పెంపు నిర్ణయంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు కూలి రూ.257 ఉంది. ప్రస్తుతం రూ.15 పెంచడంతో రూ.272 చేరుకుంది. పూర్తి కూలి పొందాలంటే నిర్దిష్ట పని కొలతలకు తగ్గట్టుగా పని చేయాల్సి ఉంటుంది.

కొత్త పనులు ప్రారంభం

2023–24 ఉపాధి కూలీల కొత్త పనులు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1నుంచి జూన్ మొదటి వారం వరకు గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా కొనసాగుతుంటాయి. ప్రతి యేటా జాబ్‌కార్డుపై వంద రోజుల పని కల్పిస్తున్నారు. ఇందులో దాదాపుగా ఏప్రిల్, మే నెలల్లోనే తమ పనిదినాలను పూర్తి చేస్తుంటారు. ఈ సారి కలెక్టర్ నారాయణరెడ్డి ఉపాధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఉపాధి పనులు పూర్తి చేయడం, కూలీలకు ఉపాధి కల్పించడం, గ్రామాల అభివృద్ధికి దోహదం చేయడం వంటి ప్రక్రియలో ఆయన పలుమార్లు సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించారు. కొత్త పనుల్లో భాగంగా పొలాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా బాటలు వేయడం, చెక్‌డ్యాంలలో, చెరువుల్లో పూడికతీత, పొలాల మధ్య కాల్వలు, లేవలింగ్ తదితర పనులకు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కోణంలోనే ఇప్పటికే ఉపాధి హామీ ఏపీఓ, టీఏ, ఈసీ, ఎఫ్ఏలు పని వివరాలను సేకరించి పనులు మంజూరు కూడా తీసుకున్నారు. వికారాబాద్ మండలంలో మొత్తం జాబ్ కార్డులు 7,140 ఉండగా, ఇందులో 6,020 జాబ్‌కార్డులు ఆక్టివ్‌గా ఉన్నాయి. ప్రస్తుతం ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఫొటో క్యాప్చర్ చేయడం జరుగుతుంది. పని జరుగుతున్న ప్రారంభంలో ఒకసారి ఫొటో తీయాలి. పని అయ్యాక సైతం ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఉత్తర్వులు రాగానే అమలు



ప్రస్తుతం కొత్త పనులు ప్రారంభం అవుతున్నాయి. గ్రామాల్లో ఉపాధి కూలీలు టార్గెట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూ.15 కూలి పెంచినట్లు నిర్ణయించింది. పెరిగిన వేతనానికి సంబంధించిన ఉత్తర్వులు అందగానే అమలు చేస్తాం. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనిచేసి పూర్తి కూలి పొందాలని కోరుతున్నాం. గ్రామాల్లో ఉపాధి కార్డు ఉన్న ప్రతిఒక్కరూ పనికి రావాలిన కోరుతున్నాం.

– శీను, ఏపీఓ

ప్రమాదవశాత్తు పుష్కరిణిలో పడిన బాలిక

పోలీసుల అప్రమత్తతతో తప్పిన ప్రమాదం


బాలిక భవానీ

యాలాల: జుంటుపల్లి రామస్వామి ఆలయ పుష్కరిణిలో ఓ బాలిక ప్రమాదవశాత్తు పడిపోయింది. పోలీసుల అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆలయ దిగువన ఉన్న నీటి గుండం (పుష్కరిణి)లో స్నానమాచరించి దర్శనం కోసం భక్తులు కొండ పైకి తరలివెళుతుంటారు. ఈ క్రమంలో తన కుటుంబంతో జాతర ఉత్సవాలకు వచ్చిన భవానీ అనే బాలిక పుష్కరిణి వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడింది. ఈత రాక నీట మునుగుతున్న బాలికను అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి బయటికిలాగి రక్షించారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో బాలిక కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న బాధితులు, యువజన కాంగ్రెస్ నేతలు

కొడంగల్ : యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. పట్టణంలోని గాంధీ నగర్ కాలనీకి చెందిన వ్యక్తి చనిపోతే పోస్టుమార్టం చేయడానికి వైద్యులు నిరాకరించినట్లు ఆరోపించారు. కొడంగల్‌లో పోస్టుమార్టం గది లేదని తాండూరుకు తీసుకెళ్లి పోస్టుమార్టం చేయించుకోవాలని వైద్యులు చెప్పినట్లు బాధితులు తెలిపారు. కొడంగల్‌లోని ప్రభుత్వాస్పత్రి స్థాయిని పెంచి 50 పడకలకు చేర్చారు. డీఎంహెచ్ఓ పరిధి నుంచి వైద్య విధాన పరిషత్‌లోకి మారింది. అయినా కొడంగల్ ఆస్పత్రిలో సమస్యలు అలాగే ఉన్నాయని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు ఆరోపించారు. పేదలు చనిపోతే పోస్టు మార్టం కోసం ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లాలని చెప్పడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించారు. ఎస్ఐ రవిగౌడ్ ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. పోస్టుమార్టం కొడంగల్‌లోనే చేయాలని డిమాండ్ చేశారు. వైద్యులు పోస్టు మార్టం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ త్వరలో పోస్టుమార్టం గదిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో సిబ్బందిని నియమించాలన్నారు. కార్యక్రమంలో గాంధీనగర్ కాలనీవాసులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

జెడ్పీ భవన నిర్మాణమెన్నడో?

- ఏడాదైనా బేస్మెట్ దాటని పనులు
- అమలుకాని మంత్రి ఎర్రబెల్లి హామీలు
- గడువులోగా నిర్మాణం ప్రశ్నార్థకమే


బేస్మెట్‌కే పరిమితమైన జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు

వికారాబాద్ : జిల్లాపరిషత్ భవన నిర్మాణ పనులు ఒక అడుగు ముందుకు.. మూడడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. ఏడాది క్రితం ఆర్భాటంగా ప్రారంభమైన పనులు నేటికీ బేస్మెట్ దాటి ముందుకు సాగడంలేదు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా 2019లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలతో నూతన జిల్లా పరిషత్ జనరల్‌బాడీ ఏర్పాటయ్యింది. నూతన జిల్లా ఏర్పాటయ్యి ఆరేళ్లు, జిల్లా పరిషత్ జనరల్ బాడీ కొలువుదీరి నలుగేళ్లు కావస్తున్నా వారికి గూడు కరువయ్యింది. వికారాబాద్ మండల పరిషత్ కార్యాలయంలోనే వారు జిల్లా పరిషత్ సేవలు అందించాల్సి వస్తోంది. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే జిల్లా పరిషత్ జనరల్ బాడీ సమావేశం కోసం మరో భవనం వెతుక్కోవాల్సి వస్తోంది.

శంకుస్థాపన చేసి ఏడాది..

నూతన జిల్లా ఏర్పాటు చేసి ఆరేళ్లు గడిచినా జిల్లా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయలేదు. జిల్లాకు గుండెకాయలాంటి జిల్లా పరిషత్‌కు సొంత భవనం మంజూరు చేయించడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈక్రమంలో ఏడాది క్రితం జిల్లా పరిషత్ నుంచే రూ.5.15 కోట్ల వ్యయంతో జెడ్పీకి సొంత భవనం నిర్మించాలని నిర్ణయించారు. నిధులు మరిన్ని కేటాయిస్తారనే ఆశతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దాయాకర్‌రావు, మంత్రి సబితారెడ్డిల చేతుల మీదుగా ఈ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేయించారు. అదనపు నిధుల సంగతే మోకానీ జిల్లా పరిషత్ నుంచి కేటాయించిన నిధులకు సంబంధించిన పనులు కూడా జరగడంలేదు. ఏడాది క్రితం టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించగా ఇంకా బేస్మెట్ దాటి ముందుకు సాగడం లేదు. అయితే రూ. 5.15 కోట్ల నిధులు సరిపోవని గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు మరో రూ. 5 కోట్ల నిధులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. భవన నిర్మాణానికి గడువు 18 నెలలు ఇవ్వగా ఇప్పటికే ఏడాది గడిచింది. కావాల్సిన దాంట్లో ఇంకా సగం నిధులు మంజూరు చేయాల్సి ఉండగా జెడ్పీ ద్వారా కేటాయించిన నిధుల్లోంచి సగం కూడా ఖర్చు చేయలేదు. మరో ఆరు నెలలు మాత్రమే గడువు ఉన్న నేపథ్యంలో నిర్మాణ పనులు పూర్తి చేయడం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఇంజనీరింగ్ అధికారుల అలసత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిధులు రాబట్టడంలో విఫలం..

ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న జిల్లా పరిషత్ భవనానికి అవసరమైన అదనపు నిధులు రాబట్టడంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవనానికి శంకుస్థాపన చేసిన సమయంలో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జిల్లా ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు పలు హామీలు ఇచ్చారు. ఇందులో ప్రధానంగా ప్రతి నియోజకవర్గంలో 10 గ్రామ పంచాయతీ భవనాలను మంజూరు చేశారు. ప్రతి జెడ్పీటీసీ సభ్యుడికి రూ.15 లక్షల చొప్పున నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి ఏడాది దాటినా ఏ ఒక్క హామీ ఇప్పటి వరకు నెరవేరలేదు.

పనులు వేగవంతం చేస్తాం



జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్న మాట వాస్తవమే. కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో కొంత జాప్యం ఏర్పడింది. ఈ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఏడాదిన్నర గడువు ఇవ్వగా అందులో ఏడాది ముగిసింది. మరో ఆరు నెలల గడువు ఉంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం అయ్యేలా చూస్తాం. అదనపు నిధుల కోసం కూడా ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పీఆర్

పార్కు కబ్జాకు యత్నం

రాజేంద్రనగర్: రూ.30 కోట్ల విలువైన జీహెచ్ఎంసీ పార్కు స్థలాన్ని కొందరు గురువారం ఉదయం ప్రహరీని కూల్చి చదును చేశారు. స్థానిక కాలనీ వాసులు అడ్డుకోని పోలీసులకు, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిందితులు పారిపోయారు. పోలీసులు బీఎండబ్ల్యూ కారుతో పాటు రెండు జేసీబీలు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు. బీఎండబ్ల్యూ, బొలేరో వాహనంపై శివారుకు చెందిన ఎమ్మెల్యే స్టికర్ ఉండడం గమనార్హం. శాస్త్రీపురం ప్రాంతంలో 1988లో హెచ్ఎండిఏ ద్వారా మొట్ట మొదటి శాస్త్రీపురం సొసైటీ లేఅవుట్‌ను చేపట్టారు. ఈ లేఅవుట్‌లో 13 పార్కులను ఏర్పాటు చేసి జీహెచ్ఎంసీకి అప్పగించారు. కాలనీలోని చర్చి, ప్రార్థనా మందిరం ఎదురుగా 1.30 ఎకరాల స్థలంలో పార్కు స్థలం ఉంది. దీన్ని చుట్టూ జీహెచ్ఎంసీప్రహరీని నిర్మించి మొక్కలను నాటి గార్డెన్‌ను నిర్వహిస్తోంది. దాదాపు 30 కోట్ల విలువైన ఈ స్థలాన్ని గురువారం ఉదయం కొందరు జేసీబీలు, టిప్పర్లతో వచ్చి చదును చేయడం ప్రారంభించారు. గంట వ్యవధిలో మొత్తం పార్కు ప్రహరీని కూల్చి చదును చేశారు. తెల్లవారుజామున 5 గంటలకే ఈ పనులు నిర్వహించడంతో స్థానికులు అడ్డుకొని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకోగానే నిందితులు పారిపోయారు. విషయాన్ని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శాస్త్రీపురం సొసైటీ సభ్యులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని జీహెచ్ఎంసీ

హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో మొట్టమొదటి లేఅవుట్ శాస్త్రీపురంలో 1988లో చేపట్టారు. దీంతో పాటు బుద్వేల్‌లో జనచైతన్య హౌసింగ్ సొసైటీ వెంచర్‌ను, మైలార్‌దేవ్‌పల్లిలో టీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీలు చేపట్టింది. ఈ మూడు స్థలాల్లో దాదాపు 50 పార్కులను రిజిస్ట్రేషన్ చేసి జీహెచ్ఎంసీకి అప్పగించారు. రోజు రోజుకూ ఈ స్థలాల విలువ పెరుగుతుండడంతో కబ్జాదారులు వీటిని కబ్జాలు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 20 పార్కులు కబ్జా అయినట్లు తెలుస్తోంది. పార్కుల నిర్వహణను జీహెచ్ఎంసీ పట్టించుకోకపోవడంతో విలువైన పార్కులు కబ్జాలకు గురవుతున్నాయి. స్థానికులు ఫిర్యాదులు చేయడం, అనంతరం కబ్జాదారులు భయభ్రాంతులకు గురి చేస్తుండటంతో స్థానికులు వెనుకడుగు వేస్తున్నారు. కబ్జాదారులు జీహెచ్ఎంసీ అధికారులతో కుమ్మక్కై కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బాలిక అదృశ్యం

రాజేంద్రనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఖాజాపాషా తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ కుటుంబం సంవత్సరం క్రితం కిస్మత్‌పూర్ సాయి బాబా కాలనీకి వలస వచ్చింది. వీరికి 17 సంవత్సరాల కూతురు ఉంది. కర్ణాటకలో ఉన్న సమయంలో స్థానికంగా ఉన్న ఓ యువకుడితో బాలిక చనువుగా ఉండేది. బుధవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు స్థానిక ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకి లభించకపోవడంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కర్ణాటకలోని బాలికతో చనువుగా ఉండే యువకుడు సైతం కనిపించడం లేదని అతడిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

- లైసెన్సులు లేకుండానే 35 మినరల్ వాటర్ ప్లాంట్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

షాబాద్: మినరల్ వాటర్ ముసుగులో కొందరు అక్రమార్కులు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని చెబుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం సాగిస్తున్నారు. షాబాద్ మండలంలో సుమారు 35 వాటర్ ప్లాంట్లు ఉన్నా అందులో ఒక్క దానికి కూడా అనుమతి లేకపోవడం గమనార్హం. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నామని, రంగు రంగుల బోర్డులతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా కనీసం నీటిని శుద్ధి చేస్తున్నారా లేదానే విమర్శలు వినిపిస్తున్నాయి. నీటి సరఫరా చేసే బాటిళ్లలో చెత్త చెదారం దర్శనమిస్తున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు. పట్టణాలకే పరిమితమైన మినరల్ వాటర్ ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు పాకింది. మండలంలో నీటి బాటిళ్ల, ప్యాకెట్లు తయారు చేస్తూ వేరే చిరునామాతో యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ. 20పైసలు ఖర్చు అవుతున్నా వాటిని రూ.2లకు అమ్ముతున్నారు. 20లీటర్ల బాటిల్‌ను రూ.10 నుంచి, రూ.15లకు అమ్ముతున్నారు. ట్యాంకర్ల ద్వారా బిందెకు రూ.5 వసూలు చేస్తున్నారు.

పట్టించుకోని సంబంధిత అధికారులు

అనుమతిలేని ప్లాంట్లు అనేకం ఉన్నా అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది. లైసెన్స్‌లు లేని వాటర్ ప్లాంట్లలను సీజ్ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి


టెంటు కూలడంతో సొమ్మసిల్లి పడిపోయిన మహిళ


క్షతగాత్రులను పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ

- టెంటు కూలి ముగ్గురికి తీవ్ర గాయాలు
- పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలింపు

షాబాద్: మండలంలోని సీతారాంపూర్‌లో గురువారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆలయంలో భక్తుల కోసం వేసిన టెంటు సుడిగాలికి కూలిపోయింది. దీంతో టెంటు రాడ్లు పడి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చందనవెళ్లి గ్రామానికి చెందిన అనుసుజాకు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. పోతుగల్ గ్రామానికి చెందిన అందాలు తలకు, భుజంపై తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మరావుగూడకు చెందిన బుచయ్యకు రక్త గాయలు అయ్యాయి. మరికొంత మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు.క్షతగాత్రులను షాబాద్ సీఐ గురువయ్య గౌడ్, ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి పోలీస్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

శ్రీరామ నవమి ఉత్సవాల్లో కిషన్‌రెడ్డి


కల్యాణ వేడుకలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

కందుకూరు: మండలంలోని తిమ్మాపూర్‌లో గురువారం నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి, అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాచులూరు కోదండ రామస్వామి ఆలయంలో ఇండియా వాలీబాల్ మాజీ కెప్టెన్, అర్జున్ అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట ఎంపీపీ ఎం జ్యోతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బీ నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏ శ్రీరాములు యాదవ్, కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అమరేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మొయినాబాద్‌రూరల్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర బీఆర్ఎస్ కార్యవర్గ సభ్యులు కొంపల్లి అనంతరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ శ్రీహరియాదవ్‌లు అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో పదేళ్ల నుంచి రాష్ట్రంలో దాదుసేవక్ సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం హిమాయత్‌నగర్ చౌరస్తాలో దాదుసేవక్ సమాజ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంతరెడ్డి, రాజయ్య, రవియాదవ్, శ్రీహరియాదవ్‌లు పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. దాదూసేవక్ సమాజ్ వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జాతీయ రహదారి హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఎంతో మంది ప్రయాణికులు, ప్రజలు తిరుగుతుంటారని అన్నారు. ఈ సంవత్సరం ఎండలు అధికంగా ఉండడంతో ఈ చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారస్తులు, యువజన సంఘాలు సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మొయినాబాద్ మండల పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మహేష్, మాల యాదయ్య, మాలస్వామి, రమేష్, దాదూ సేవక్ సమాజ్ సంస్థ నాయకులు జట్‌మల్ చండక్, గన్‌శ్యామ్‌దాస్, రాజేష్‌దాదూ, పురుషోత్తమ్ లడ్డా, నందకిషోర్ చండక్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల సమస్యలపై సీఎంను కలుస్తా'

యాచారం: ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి నివేదిస్తానని పీఆర్టీయూ టీఎస్ నేత గుర్రం చెన్నకేశవరెడ్డి అన్నారు. తన స్వగ్రామం మొండిగౌరెల్లిలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన గెలుపు కోసం పీఆర్టీయూ టీఎస్ శ్రేణులు ఎంతగానో కష్టపడ్డారని తెలిపారు. తన ఓటమికి ఎన్నో కారణాలు ఉన్నాయని, వాటిపై పూర్తి స్థాయిలో సమీక్షించినట్లు చెప్పారు. పీఆర్టీయూ టీఎస్ నుంచి రెండుసార్లు గెలిచిన జనార్దన్‌రెడ్డి రెబల్‌గా మళ్లీ పోటీ చేసి ఓట్లు చీల్చడం, డబ్బు ప్రభావితం చేశాయన్నారు. అయినా ఆందోళన చెందడం లేదని, ఉపాధ్యాయుల సమస్యలే ప్రధాన ఎజెండాగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వివరించారు.



నందిగామ మండలం గుడి మామిడిపల్లి సీతారాముల ఆలయంలో గురువారం నిర్వహించిన కల్యాణ వేడుకలో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ పాల్గొన్నారు. సీతారాముల కల్యాణంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కవిత, ఎంపీపీ రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

– నందిగామ